# విద్యార్థులకు ఇబ్బందులు రావద్దు

అందోల్, జులై 25: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పాండు అన్నారు. గురువారం బాలికల పాలిటెక్నిక్, బాలికల సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్, ఇతర సమస్యలపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో మళ్లీ సాంకేతిక లోపం రాకుండా కరెంట్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వసతి గృహం ఆవరణలో పిచ్చి మొక్కలు తొలిగించాలని.. టాయిలెట్లు శుభ్రంగా ఉంచి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో భోజనం, టిఫిన్, విద్యార్థులకు అందించే స్నాక్స్ తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులంటే నేరుగా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో పాండు

# పంట రుణాలు రెన్యువల్ చేయాలి

**బ్యాంకర్లతో కలెక్టర్ వల్లూరు క్రాంతి**

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 25: పంట రుణమాఫీ పొందిన రైతుల రుణాలను రెన్యువల్ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో రైతు రుణ మాఫీపై ఫేజ్-1 అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీలో భాగంగా ఏపీజీవీబీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ లో అత్యధికంగా రైతులు పంట రుణాలు మాఫీ పొందారని తెలిపారు. రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం పంట రుణమాఫీ డబ్బులు వాడుకునే విధంగా వెంటనే చెల్లించాలని ఆదేశించారు. పంట రుణాలను ఇతర రుణాల కింద జమ చేసుకోవద్దన్నారు. పంట రుణాల రెన్యూవల్‌ను రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారి అంబికాసోనీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టరేట్‌లో డీఆర్ఓ పద్మజారాణికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

# నష్టపరిహారం పెంచి ఇవ్వాలి

సంగారెడ్డి, జూలై 25: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిర్మిస్తున్న బీదర్-మహేశ్వరం 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో రైతులు కోల్పోతున్న భూములకు నష్టపరిహారం పెంచి అందజేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, పొల్యూషన్ బోర్డు రాష్ట్ర సభ్యుడు సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రధాన కార్యదర్శి వెంకట్‌తో కలిసి కలెక్టరేట్‌లో డీఆర్ఓ పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ట్రాన్స్‌మిషన్ లైన్ నాలుగు మండలాల మీదుగా వేసేందుకు అన్ని సర్వేలు పూర్తి చేశారని, త్వరలో నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. ఈ లైన్లు నాగిల్‌గిద్ద, మనూర్, న్యాల్‌కల్, రాయికోడ్, ఝరాసంగం, మునిపల్లి మండలాల మీదుగా నిర్మించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో ఒక్కో రైతు దాదాపు ఒక్కో టవర్ నిర్మాణానికి 12 గుంటలు, విద్యుత్ లైన్ ఏర్పాటుకు మరో 12 గుంటల భూమి కోల్పోతారన్నారు. ఆయా మండలాల పరిధిలో ప్రస్తుతం భూముల ధరలు రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్లు పలుకుతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తెలంగాణలో 165 కిలో మీటర్ల మేర నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో 3 వేల ఎకరాల భూమి కోల్పోతారన్నారు. అంతేకాకుండా టవర్, లైన్ల పరిసరాల్లో గృహ సముదాయాల నిర్మాణాలు, పరిశ్రమలు, విద్యా సంస్థల ఏర్పాటుకు అనువుగా ఉండవని ముందే హెచ్చరిస్తున్నారన్నారు. విద్యుత్ చట్టం 2003 ప్రకారం రైతులు నష్టపోతున్న భూములకు అధిక మొత్తంలో పరిహారం పెంచి పంపిణీ చేసేలా కలెక్టర్ క్రాంతి ప్రత్యేక శ్రద్ధ వహించి రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు.

# మహిళల రక్షణ అందరి బాధ్యత

అందోల్, జూలై 25: మహిళల రక్షణ, భద్రత అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జోగిపేటలోని నెహ్రూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిషన్ శక్తి 100 రోజుల సదస్సులో మాట్లాడారు.. విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, గృహహింస, వరకట్న వేదింపులు, పనిప్రదేశంలో లైంగిక వేదింపులు నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు, జిల్లా అధికారిని పల్లవి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సూపర్‌వైజర్ జ్యోతి, ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, జడ్జి రమేశ్

## 'దోస్త్'.. సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 25: ఇప్పటి వరకు డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందలేని విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మరో అవకాశం కల్పించిందని తారా ప్రభుత్వ, జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లను ఆగస్టు 2లోగా చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27 నుంచి ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలన్నారు. స్పెషల్ ఫేజ్ వెరిఫికేషన్ ఆఫ్ స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ ఆగస్టు 2న ఉంటుందని, ఆగస్టు 6న స్పెషల్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్, ఆగస్టు 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, అదే తేదీలో సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని వివరించారు.

## 27న స్పాట్ అడ్మిషన్లు

హత్నూర, జూలై 25: మండల కేంద్రమైన హత్నూరలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈనెల 27న మిగిలి ఉన్న ఖాళీల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. కళాశాలలో ఇంటర్, ఒకేషనల్ కోర్సుల్లో ఖాళీలు ఉండటంతో వాటిని భర్తీ చేస్తామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. గ్రామీణప్రాంత విద్యార్థులకు రూ.1 లక్ష 50 వేలు, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.2 లక్షల వార్షిక ఆదాయం ఉండాలన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హౌస్ వైరింగ్‌లో శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 25: స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఆగస్టు 5 నుంచి నెల రోజుల పాటు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, కోర్సు మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు టూల్ కిట్ ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94901 03390, 94901 29839 నంబర్లపై సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం, జూలై 25: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాంకు చెందిన జెతిన్‌బోరా(55) పది రోజుల క్రితం పనికోసం హైదరాబాద్‌కి వచ్చాడు. మూసాపేట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని ఉందని తెలిసి అక్కడికి వెళ్తే ఉద్యోగం ఇవ్వలేదు. అక్కడి నుంచి తెల్లాపూర్‌కి వస్తున్న క్రమంలో బుధవారం రాత్రి మైహోం సయూక్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్ వైపుగా వస్తున్న బైక్ జెతిన్‌బోరాను ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన అతన్ని సిటిజన్ దవాఖానకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స అందించి గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి సోదరుడి కొడుకు కౌషిక్‌బోరా ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

పుల్కల్, జూలై 25: కంది మండలం తునికిల్ల తండా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రులు మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాదం అలుముకుంది. మండలంలోని గంగోజిపేట్ గ్రామానికి చెందిన కాశపాగ సందీప్‌కుమార్(22), కాశపాగ నవీన్‌కుమార్(22), గొంగ్లూర్ గ్రామానికి చెందిన సంటిపిల్ల అభిషేక్ (23) మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. విషయం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా భాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా కల్పించారు.

# కొడకంచిలో 'మిషన్ శక్తి'

జిన్నారం, జూలై 25: మండలంలోని కొడకంచిలో జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలల హక్కులు, న్యాయ చట్టాలు, విజ్ఞానంతో సహా సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ సేఫ్టీ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళల ప్రాధాన్యం, అభ్యున్నతి, జీవన నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలపై వివరించారు. చైల్డ్ కోఆర్డినేటర్ యాదగిరి, పటాన్‌చెరు లేబర్ ఆఫీసర్ వీరేశం, డీహెచ్ఈడబ్ల్యూ యాదగిరి స్కోప్ ఎన్‌జీవో సరిత, హెచ్ఎం ప్రేమావతి, కవి మొగలిమాల, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి దొంగల హల్‌చల్

**నందిగామ దుర్గామాత ఆలయంలో హుండీ మాయం**

పటాన్‌చెరు, జూలై 25: నందిగామ గ్రామ నడిబొడ్డున ఉన్న దుర్గామాత ఆలయంలో దొంగలు హుండీని పెకిలించి ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం గ్రామస్తులు గుర్తించి బీడీఎల్ పోలీసులకు సమాచారమిచ్చారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో అర్ధరాత్రి 1.40 ప్రాంతంలో రెండు బైక్‌లపై దుర్గామాత ఆలయానికి వచ్చారు. నలుగురు ఆలయ ప్రాంగణంలోని హుండీని బలవంతంగా పెకిలించి ఎత్తుకెళ్లారు. ఆలయం పక్కనున్న సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. ఉదయం గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. దాదాపు రూ.10వేలు హుండీలో ఉన్నట్టుగా భక్తులు చెబుతున్నారు. దొంగలు గ్రామంలోను అర్ధరాత్రి చక్కర్లు కొట్టినట్టుగా సీసీ కెమెరాల్లో నమోదైంది. గ్రామస్తులు లక్ష్మయ్య గౌడ్ పోలీసులకు దొంగతనం జరిగినట్టు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బీజేపీ నేతలను అరెస్ట్ చేయడం అన్యాయం

కోహీర్, జూలై 25: కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించకుండా తమను అరెస్ట్ చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు కిష్టయ్య అన్నారు. గురువారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించేందుకు సంగారెడ్డి పట్టణానికి బయలుదేరుతున్నారనే సమాచారంతో ముందస్తుగా నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై విజయం సాధించినందుకు, అమర వీర సైనికులకు నివాళులర్పించేందుకు కాగడాల ప్రదర్శన చేపట్టాలని బీజేవైఎం నిర్ణయించిందన్నారు. వరప్రసాద్, దశరథ్ ఉన్నారు.

**ఖేడ్‌లో ముందస్తు అరెస్టు**

నారాయణఖేడ్, జూలై 25: జాబ్ క్యాలండర్ విడుదల చేయాలనే డిమాండ్‌తో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్యం సహా నాయకులు రవికుమార్, దశరథ్, సతీశ్‌కుమార్, సాయేందర్‌ను అరెస్ట్ చేసి సొంత ఊచీకత్తుపై విడుదల చేశారు.

# పారిశుధ్య పనుల పరిశీలన

ఝరాసంగం, జూలై 25: వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరికివారు స్వయంగా పరిశుభ్రతను పాటించలని ఎంపీడీవో సుధాకర్ గ్రామస్తులకు సూచించారు. గురువారం ఝరాసంగం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామాన్ని సందర్శించి పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ మొక్కలను సంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ కార్యదర్శి, మల్టీ పర్పస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుధాకర్

# కరాటే మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ముత్తంగి కరాటే మాస్టర్‌పై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పటాన్‌చెరు, జూలై 25: ముత్తంగి జడ్పీహెచ్ఎస్‌లో కరాటే క్లాసులు చెప్పే మాస్టర్‌పై గ్రామస్తులు ఎంఈవో పీపీ రాథోడ్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ముత్తంగి గ్రామస్తులు వెంకటేశ్, పుణ్యవతి, శ్రీనివాస్ తదితరులు ఎంఈవో రాథోడ్‌ను కలిసి కరాటే మాస్టర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. ముత్తంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో కరాటే నేర్పే మాస్టర్ కుమార్ విద్యార్థినులను వేదిస్తున్నాడని పేర్కొన్నారు. కరాటే క్లాసులకు హాజరుకావాలని లేని పక్షంలో కఠిన చర్యలుంటాయని హెచ్చరిస్తున్నాడన్నారు. విద్యార్థినులతో అసభ్య ప్రవర్తనను తెలుసుకున్న గ్రామస్తులు గతంలోను నిలదీస్తే కొందరు మధ్యవర్తులు సర్దిచెప్పారని తెలిపారు. కరాటే మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. స్పందించిన ఎంఈవో కుమార్‌పై విచారణ చేస్తామని హామీనిచ్చారు.

# నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

తనిఖీకి వచ్చిన అధికారులు

సంగారెడ్డి, జూలై 25: జిల్లాలోని ప్రతి 11కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను పరిశీలించాలని, వీఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను నిరంతరం అందించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎండీ రొనాల్డ్ రోస్, ఐఏఎస్ అధికారి ఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. గురువారం పట్టణంలోని విద్యుత్ ఇంజినీరింగ్, ఆపరేషన్ నిర్వహణ పనులను సకాలంలో అమలు చేసేందుకు ఉన్న మెటీరియల్ స్టాక్‌లను పరిశీలించారు. వానకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో వీఫలమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్లను పట్టణాల్లో 24 గంటల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా ఏర్పాటు చేయాలన్నారు.

# ఆయుష్మాన్ భారత్‌పై సమీక్ష

నారాయణఖేడ్, జూలై 25: జిల్లా ఎంసీహెచ్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ నాగనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి గురువారం నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. వారు పీహెచ్‌సీల వారీగా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యం మేరకు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ-సంజీవనితోపాటు ఇతర ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కార్యాలయ డిప్యూటీ డీఎంహెచ్‌వో వజ్రం, వైద్యాధికారులు సంజీవ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యాధికారులు రాజేశ్వర్, నాగమణి, నర్సింగ్ చౌహాన్, జవేరియా బేగం, నవాజ్, రాజేందర్‌రెడ్డి, జట్ల భాస్కర్ పాల్గొన్నారు.

# ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయాలి

అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి, జూలై 25: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల్లో కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ దవాఖానలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ మాధురికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డితోపాటు జహీరాబాద్, సదాశివపేట ప్రాంతాలు పట్టణపరంగా విద్యాసంస్థలు, దవాఖానలు, షాపింగ్‌మాల్స్‌తో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రతిష్టాత్మకంగా జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటుతో మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇందులో పని చేసే వేలాది మంది కార్మికుల కోసం ఈఎస్ఐ ఏర్పాటు తప్పనిసరన్నారు. ఒక్క జహీరాబాద్‌లోనే మూడు వేల మంది ఈఎస్ఐ కార్డు హోల్డర్లు ఉన్నారన్నారు. ప్రతినెలా రూ.23 లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఈఎస్ఐకి కార్మికుల నుంచి కాంట్రిబ్యూషన్ వస్తున్నదన్నారు. రోజుకు ఒక్క డిస్పెన్సరీకి 175 నుంచి 200 మంది కార్మికులు వస్తుంటారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్, నాయకులు నర్సింలు, కృష్ణ, ప్రభాకర్, కుమార్ పాల్గొన్నారు.

# మంజూరైన రుణాలను వెంటనే ఇవ్వాలి

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణఖేడ్, జూలై 25: మండల పరిధిలోని పలువురు గిరిజనులకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణ మొత్తాన్ని అందజేయాలని కోరుతూ బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ గురువారం హైదరాబాద్‌లో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ చేపట్టి బ్యాంకర్లు కాన్సెంట్ జారీ చేయడంతో ప్రస్తుతం ఆయా లబ్ధిదారుల రుణ మొత్తం పీడీ ఖాతాలో పెండింగ్‌లో ఉందని చెప్పారు. చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ రుణాలు మంజూరయ్యే విధంగా చూస్తానని భరోసా ఇచ్చినట్లు రమేశ్‌చౌహాన్ తెలిపారు. ఆయన వెంట నాయకులు రాజు నాయక్, రవినాయక్ ఉన్నారు.

# తడిసిన ఇండ్లను ఖాళీ చేయాలి

జోగిపేటలో పాత ఇండ్లను పరిశీలిస్తున్న కమిషనర్ తిరుపతి

అందోల్, జూలై 25: అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో ప్రజలెవరూ తడిసిన ఇండ్లలో నివాసం ఉండకూడదని కమిషనర్ తిరుపతి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో వర్షానికి తడిసిన ఇండ్లను తహసీల్దార్ భాస్కర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు పాత ఇండ్లు పూర్తిగా తడిసినట్లు గుర్తించామన్నారు. వెంటనే వాటిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అన్ని వార్డుల్లో తిరుగుతూ ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఉన్నారు.

# కేతకీలో అదనపు కలెక్టర్ పూజలు

ఝరాసంగం, జూలై 25 : కేతకీ సంగమేశ్వర ఆలయానికి అదనపు కలెక్టర్ చంద్రశేకర్ కుటుంబ సమేతంగా సందర్శించి పూజలు చేశారు. గురువారం ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో జలలింగాన్ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు అదనపు కలెక్టర్‌ను పూలమాల, శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీవో రాజు, ఎంపీడీవో సుధాకర్, తహసీల్దార్ సంజీవరావు, ఆర్ఐ రామారావు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# హాస్టల్‌కు కొత్త భవనం నిర్మించాలి

సంగారెడ్డి, జూలై 25: తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయాలని, డిపార్ట్‌మెంట్ అటాచ్డ్ హాస్టల్‌కు కొత్త భవనం నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బాబానగర్‌లో ఉన్న హాస్టల్‌లో కేవీపీఎస్ సమగ్ర సర్వే నిర్వహించింది. విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్ సరిపోవడంలేదని వెంటనే నూతన భవనం నిర్మించాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శి ప్రవీణ్, సభ్యుడు చంద్రశేఖర్ ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

# విష జ్వరాలతో జాగ్రత్తగా ఉండాలి

రాయికోడ్, జూలై 25: జిల్లా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు జగ్రతగా ఉండాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని సింగితం, కౌరంగనగర్, హస్నాబాద్, కోడూర్, రాయిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ.. ముసురుతో వచ్చే విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యం అనిపిస్తే దగ్గర్లోని పీహెచ్‌సీలో చూపించుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఏఈ దేవయ్య ఉన్నారు.

# తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

సంగారెడ్డి, జూలై 25: సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సహారా ఇంక్లుసివ్ దవాహానను గురువారం ప్రారంభించారు. సహారా సంస్థ అధ్యక్షురాలు జ్యోత్స్న మడపతి రిబ్బన్ కట్ చేసి దవాఖానను ప్రారంభించారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో దవాఖానను ప్రారంభించినట్లు సహారా సంస్థ సెక్రటరీ శంకర్ మటం తెలిపారు. దవాఖానలో అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. దవాఖానలోనే డీ అడిక్షన్ సెంటర్‌ను సైతం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ధీమంత్‌రెడ్డి, డాక్టర్ కిరణ్ జోషి, డాక్టర్ శ్యామ్ మనోహర్, డాక్టర్ అక్షిత ముదిగొండ, డాక్టర్ శ్రేయ, డాక్టర్ అక్షర, సిబ్బంది పాల్గొన్నారు.



వట్‌పల్లి: ఉసిరికపల్లిలో ఉపాధ్యాయునిని సన్మానిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

# ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

వట్‌పల్లి, జూలై 25: మండలంలోని ఉసిర